# అప్పు తీర్చలేదని భార్యాభర్తల హత్య

ఫిలింనగర్‌లో దారుణం

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

నిందితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్, డిసెంబర్ 8 : తీసుకున్న అప్పును తిరిగి చెల్లించలేదన్న కోపంతో ఓ వ్యక్తితో పాటు అతడి భార్యను దారుణంగా హత్య చేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... ఫిలింనగర్ పీఎస్ పరిధిలోని సత్యాకాలనీ పయోనీర్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న సయ్యద్ అహ్మద్ ఖాద్రీ (42) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడికి 2014లో సయీదా మిరాజ్ ఫాతిమా (40)తో వివాహమైంది. రెండేండ్ల క్రితం మేకల వ్యాపారం కోసం నదీం కాలనీలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తివద్ద అహ్మద్ ఖాద్రీ సుమారు 20లక్షలు అప్పుగా తీసుకొని తిరిగి ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వాలంటూ పలుమార్లు ఖాద్రీ ఇంటికి వచ్చి వారు నిలదీశారు. అయితే తమకు డబ్బులు రావాల్సి ఉందని, త్వరలోనే ఇస్తామంటూ ఫాతిమా సైతం చెబుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో గత నెల 28న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అహ్మద్ ఖాద్రీ తిరిగి రాలేదు. కాగా 29న రాత్రి సయీదా మిరాజ్ ఫాతిమాకు హుమాయున్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆమె అక్క మునీర్ ఫాతిమా పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో ఖాద్రీకి కాల్ చేయగా అతడు కూడా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. సత్యాకాలనీలోని మిరాజ్ ఫాతిమా ఇంటికి వచ్చి చూడగా తాళం వేసి ఉంది. ఇంట్లో నుంచి గ్యాస్ వాసన రావడంతో తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా బట్టల మూటల కింద మిరాజ్ ఫాతిమా మృతదేహం కనిపించింది. ఈ మేరకు మునీర్ ఫాతిమా గత నెల 30న ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిరాజ్ ఫాతిమా భర్త ఖాద్రీ ఆమెను హత్యచేసి పారిపోయి ఉంటాడని, గతంలో పలుమార్లు ఆమెకు పిల్లలు పుట్టడం లేదని వేధిస్తుండే వాడని మునీర్ ఫాతిమా ఫిర్యాదులో పేర్కొంది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

### భర్తను చంపిన తర్వాత భార్యనూ..

మిరాజ్ ఫాతిమా హత్య కేసులో దర్యాప్తు ప్రారంభించిన ఫిలింనగర్ పోలీసులు ఖాద్రీ కోసం గాలింపు చేపట్టగా షాకింగ్ నిజాలు బయటకు వచ్చాయి. ఫాతిమా హత్యకు గురి కావడానికి ముందే ఆమె ఇంటికి ముగ్గురు వ్యక్తులు వచ్చారు. సీసీ పుటేజీల ఆధారంగా... చేతిలో బిర్యానీ ప్యాకెట్‌తో వచ్చిన ముగ్గురు వ్యక్తుల గురించి ఆరా తీయగా ఫాతిమా భర్త ఖాద్రీకి అప్పు ఇచ్చిన వ్యక్తి కూడా వారిలో ఉన్నాడు. దీంతో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేశారు. గత నెల 28న రాత్రి నదీమ్ కాలనీలో చెరువు వద్దకు ఖాద్రీని పిలిచిన దుండగులు అతడిని దారుణంగా హత్య చేయడంతో పాటు చెరువువద్ద గొయ్యి తీసి పాతిపెట్టారు. హత్య విషయం బయటకు రావద్దంటే ఖాద్రీ భార్య మిరాజ్ ఫాతిమాను కూడా చంపేయాలని ఆ ముగ్గురు వ్యక్తులు నిర్ణయించుకున్నారు. మిరాజ్ ఫాతిమా ఇంటికి వచ్చి ఆమెను చున్నీతో గొంతు బిగించి చంపేసి.. బట్టలమూట కింద శవాన్ని దాచిపెట్టి పారిపోయారు. నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకున్న ఫిలింనగర్ పోలీసులు వారిని ప్రశ్నిస్తున్నారు. హత్యకు గురైన ఖాద్రీ మృతదేహం కోసం గాలింపు చేపట్టారు.



చెక్కులను అందజేస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

## కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులకు చెక్కులు పంపిణీ

సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): అనారోగ్యంతో ముగ్గురు కానిస్టేబుళ్లు మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు చెక్కులను శుక్రవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అందజేశారు. కీసర ఠాణాకు చెందిన శ్రీనివాస్ కుటుంబానికి రూ. 6,80,951, నారాయణ్‌పూర్ ఠాణాకు చెందిన కానిస్టేబుల్ అశోక్ కుటుంబ సభ్యులకు రూ. 7,39,100 వారి భార్య, పిల్లల పేర్లపై, మల్కాజిగిరి కానిస్టేబుల్ వినోద్‌కుమార్ కుటుంబానికి రూ. 7,92,440లను అతని తల్లిదండ్రుల పేర్లపై చెక్కులను సీపీ అందజేశారు. ఆయా కుటుంబ సభ్యులకు పెన్షన్, ఉద్యోగం త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ఐదేండ్లు జైలు

నాంపల్లి కోర్టులు, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడు సందీప్‌బిషెప్ (27)కి 307ఐసీపీ సెక్షన్ కింద ఐదేండ్ల జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా, మరో సెక్షన్ 354 కింద రెండేళ్ల జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ 1వ అదనపు జిల్లా కోర్టు జడ్జి రమాకాంత్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముకుంద్‌రెడ్డి కథనం ప్రకారం.. గతేడాది ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారి వి.సుమన్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి వాంగ్మూలాలను నమోదు చేశారు. అనంతరం పోలీసులు పూర్తి సాక్ష్యాధారాలతో కోర్టుకు చార్జిషీట్‌ను దాఖలు చేశారు. విచారణ చేపట్టిన కోర్టు సాక్షుల వాంగ్మూలం ప్రకారం నేరం రుజువైనట్టు తీర్పు ప్రకటించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా జైలుశిక్షను అనుభవించాల్సి ఉంటుందని కోర్టు తీర్పులో పేర్కొంది.

## ప్రవీణ్‌ను కోర్టులో హాజరుపర్చిన అధికారులు

22కు విచారణ వాయిదా

నాంపల్లి కోర్టులు, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో ప్రధాన నిందితుడు పులిదిండి ప్రవీణ్‌కుమార్‌ను 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట జైలు అధికారులు శుక్రవారం హాజరుపర్చారు. తెలంగాణ హైకోర్టులో ప్రవీణ్ తరపున బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ కేసులో 37వ నిందితుడి వరకు 9మంది గైర్హాజరు కావడంతో వారి తరపు న్యాయవాదులు గైర్హాజరు పిటిషన్లను కోర్టుకు సమర్పించారు. నిందితులందరూ వచ్చే వాయిదా 22వ తేదీన కోర్టుకు హాజరు కావాలని మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య ఆదేశించారు. ఎగ్జామినేషన్ ప్రక్రియకు హాజరు కావాలని కోర్టు తెలిపింది. 3,4,5,17,18,25,28,32,34వ నిందితులు కోర్టుకు హాజరు కాలేదు. 22వ తేదీకి విచారణను వాయిదా వేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.


హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
కూకట్‌పల్లి సర్కిల్-24
GHMC

30/GHMC/KPC-24/EE/2023-24, తేది: 08-12-2023

NIT No. 30/GHMC/KPC-24/EE/2023-24, తేది: 08-12-2023. పని పేరు: ఇన్‌స్టంట్ రిపేర్ టీమ్. అంచనా మొత్తం/ECV: 91.90 లక్షలు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది/చివరి తేది & సమయం: 13-12-2023న ఉ|| 10.30 గం./20-12-2023న ఉ|| 11.00 గం. అధికారి పేరు & చిరునామా: శ్రీ D. గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, GHMC, కూకట్‌పల్లి సర్కిల్-24, సెల్: 9154299633. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in/ వద్ద చూడగలరు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, కూకట్‌పల్లి సర్కిల్-24, GHMC.

DIPR RO.No. 8524-PP/CL/ADVT/1/2023-24, Dt: 08-12-2023

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, L.B. నగర్ జోన్.
GHMC

NIT No. 04/CTO/LBNZ/GHMC/2023-24, సంక్షిప్త టెండరు ప్రకటన తేది: 07-12-2023

పని పేరు: GHMC, LB నగర్ జోన్‌లో FY 2023-24లో 60 రోజుల కాలానికి (6 నెలలలో పనిరోజులు ఏది ముందుగా అయితే అదే) STF టీమ్స్ కొరకు సిబ్బంది మరియు మెషినరీ ఏర్పాటు చేయుట. అంచనా మొత్తం (రూ. లక్షలలో): 60.00 లక్షలు. మొత్తం 1 నెం. పని: 60.00 లక్షలు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది/చివరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 11-12-2023న ఉ|| 11.00 గం. బిడ్ స్వీకరణకు చివరి తేది & సమయం: 13-12-2023న ఉ|| 11.00 గం. అధికారి పేరు & చిరునామా, ఫోన్ నెం: CTO, LBNZ, GHMC జోనల్ కార్యాలయం, గడ్డిఅన్నారం, హైదరాబాద్. dctolbnz@gmail.com, 9701365515. తదుపరి వివరాలను https://tender.telangana.gov.inలో చూడవచ్చును.

సం/- చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, L.B. నగర్ జోన్, GHMC.

DIPR RO.No. 8533-PP/CL/ADVT/1/2023-24, Dt: 08-12-2023


## మొబైల్ ఇవ్వలేదని.. స్నేహితుడి హత్య

జవహర్‌నగర్, డిసెంబర్ 8: దమ్మాయిగూడలో దారుణం చోటుచేసుకుంది. మొబైల్ ఇవ్వలేదని... తోటి స్నేహితుడినే అంతమొందించిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడ ప్రాంతంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జితేందర్ చౌదరి గత కొంత కాలంగా పెయింటింగ్ కాంట్రాక్టర్‌గా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కూలీ పనుల కోసం ఉత్తర్‌ప్రదేశ్ చెందిన ఇద్దరు యువకులు రవి జెనార్(15), సచిన్(15) అలియాస్ బాబు చమర్‌లను తీసుకువచ్చి పనులు చేయించుకుంటున్నాడు. గురువారం పనులకు వెళ్లిన యువకులు సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చారు. కల్లు తాగడం అలవాటు ఉన్న యువకులు రాత్రి సమయంలో కల్లుతాగి పడుకున్నారు. మరుసటి రోజు శుక్రవారం సచిన్ తన మొబైల్ ఫోన్ ఇవ్వమని రవి జెనార్‌ను అడిగాడు. జితేందర్ చౌదరి పని నిమిత్తం బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ తీవ్రస్థాయిలో చోటుచేసుకోగా సహనం కోల్పోయిన సచిన్... రవి జెనార్‌ని కూరగాయలు కోసే కత్తితో కడుపులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమై రవి జెనార్ అక్కడిక్కడే మరణించాడు. జితేందర్ చౌదరి(38) ఇంటికి వచ్చి చూడగా రవి జెనార్ అప్పటికే రక్తపుమడుగులో కనిపించాడు. ఏమైందని సచిన్‌ను అడగ్గా... మొబైల్ ఇవ్వనందున కూరగాయలు కోసే కత్తితో పొడిచానని చెప్పాడు. స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలుపగా.. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. నిందితుడు సచిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. జితేందర్ చౌదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సీఈడీలో ఉచిత శిక్షణ

హిమాయత్‌నగర్, డిసెంబర్ 8: వ్యవసాయ, వ్యయసాయేతర రంగాల్లో యువతి, యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఫర్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (సీఈడీ) నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రి క్లినిక్, అగ్రి వ్యాపారంపై 45 రోజుల పాటు కూకట్‌పల్లిలోని సీఈడీ సంస్థలో ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు కూడా అందజేస్తారు. భోజన సదుపాయం ఉంటుందని, డిప్లొమా, డిగ్రీ, పీజీ, బీఎస్సీ(బీజెడ్‌సీ) కోర్సులు పూర్తిచేసి తెలంగాణ ప్రాంతానికి చెందినవారై ఉండాలి. ఈ నెల 14వ తేదీ లోపు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 703 666 6421/422/424 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## నేడు, రేపు వార్షిక రేడియో కన్వెన్షన్

సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : లామకాన్ అమెచ్యూర్ రేడియో క్లబ్ ఆధ్వర్యంలో ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీలో శని, ఆదివారం వార్షిక రేడియో కన్వెన్షన్ జరగనుందని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక రేడియో టెక్నాలజీలో తీసుకురావాల్సిన మార్పులపై చర్చించనున్నారు. ముఖ్యంగా వైర్‌లెస్ ప్రయోగాలు, రేడియో స్పోర్ట్, అత్యవరసర కమ్యునికేషన్‌లపై వినూత్న ఆలోచనలు పంచుకునేందుకు దేశ వ్యాప్తంగా 500 మంది ఔత్సాహికులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. రేడియో కమ్యునికేషన్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం పై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.

## ఒడిశా టూ హర్యానా.. గంజాయి స్మగ్లింగ్

సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఒడిశా నుంచి హర్యానాకు హైదరాబాద్ మీదుగా గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. కోటి 28లక్షల 58 వేల విలువైన 510 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గంజాయి స్మగ్లింగ్ చేసే డీలర్ హర్యానాలోని హిస్సార్ ప్రాంతంలో ఉంటాడు. ఇతడికి ఒడిశాలోని కలిమెల ప్రాంతంలో గంజాయి విక్రేతలతో పరిచయం ఉండటంతో అక్కడకు వెళ్లి 510 కిలోల గంజాయి ఆర్డర్ ఇచ్చి తిరిగి హర్యానాకు చేరుకున్నాడు. హర్యానాలో తన స్నేహితుడైన ప్రవీణ్ కుమార్, బంధువైన మనోహర్‌ను కలిశాడు. ఒడిశా నుంచి హిస్సార్‌కు గంజాయి రవాణా చేసిపెడితే భారీగా డబ్బులు ఇస్తానంటూ నమ్మించి, ఒక ట్రాలీని వారికి అప్పగించాడు. ఆ ట్రాలీలో ఎవరికి అనుమానం రాకుండా రహస్యంగా క్యాబిన్లు చేయించాడు. దీంతో మనోహర్, ప్రవీణ్‌కుమార్ ఒడిశాకు వెళ్లి అక్కడ గంజాయి తీసుకొని తమ వాహనంలో సీక్రెట్ ప్లేస్‌లో దాచిపెట్టి బయలుదేరారు. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రాగానే మల్కాజిగిరి ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ రాములు బృందం, మేడిపల్లి పోలీసులతో కలిసి వాహనాన్ని పట్టుకున్నారు. అందులో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఓఎస్‌ఓటీ డీసీపీ గిరిధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి కండ్లల్లో కారం చల్లి

## దోపిడీకి యత్నం

ఇద్దరు పాత నేరస్తులు అరెస్ట్

సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): అర్ధరాత్రి రోడ్లపై ఒంటరిగా వెళ్లే వారి కండ్లల్లో కారం పొడి చల్లి దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సీసీఎస్ స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ అరెస్ట్ చేసింది. సీసీఎస్ డీసీపీ శిల్పవల్లి కథనం ప్రకారం.. ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ అబ్దుల్ మజార్ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. రఫై చదువుకుంటున్నాడు. వీరిద్దరూ స్నేహితులు. ఈజీగా డబ్బు సంపాదించేందుకు గురువారం రాత్రి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కండ్లలో కారం పొడి చల్లి అతని వద్ద ఉన్న నగదును దోచుకునేందుకు ప్రయత్నించారు. బాధితుడు వారిని అడ్డుకొని చార్మినార్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. దీనిపై సీసీఎస్ పోలీసులు కూడా దృష్టి పెట్టారు. ఇన్‌స్పెక్టర్ భిక్షపతి నేతృత్వంలోని బృందం ఈ ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసింది. ఈ ఇద్దరిపై గతంలో దొంగతనం కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

## వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయండి

సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): మహిళలపై జరిగే వేధింపులపై ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని రాచకొండ మహిళా భద్రత ఏసీపీ వెంకటేశం సూచించారు. షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ పర్యవేక్షణలో శుక్రవారం బాలాపూర్ ఆర్‌సీఐ రోడ్డులోని అంతర్జాతీయ అడ్వాన్స్‌డ్ రిసర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్(ఏఆర్‌సీఐ)లో మహిళా భద్రత అండ్ సైబర్ నేరాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... వేధింపులు, బెదిరింపులు, సోషల్‌మీడియా దుర్వినియోగం, సైబర్‌లో ఆర్థిక మోసాలకు సంబంధించి జరుగుతున్న నేరాలపై అవగాహన పెంచుకొని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాంటి నేరాలు జరిగినప్పుడు రాచకొండ పోలీస్ వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్ 8712662111, 8712662662, సైబర్‌క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు వెంటనే కాల్ చేయాలని సూచించారు.